నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 29 మార్చి 2025 | MAHABUBNAGAR NARAYANPET


# వేతన వెతలు!



- పారిశుద్ధ్య కార్మికులకు 8 నెలలుగా అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందులతో పండుగవేళ పస్తులుండాల్సిన దుస్థితి
- ట్రెజరీలో నిలిచిన జీపీ చెక్కులు
- పంచాయతీలకు నిధుల కొరత
- రెండ్నెళ్లే వచ్చాయంటున్న అధికారులు

వనపర్తి, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : పల్లెసీమలు బాగుంటేనే రాష్ట్ర, దేశ ప్రగతి బాగుంటుంది. గ్రామీణ వ్యవస్థ పట్టుగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అంటూ చెబుతుంటే.. వినడానికి సొంపుగానే ఉన్నది. నాడు గాంధీజీ కలలుగన్నట్లుగా పచ్చగా కనిపించిన తెలంగాణ పల్లెలు మళ్లీ వెనక్కి వెళుతున్నాయి. సరికదా.. గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సైతం జీతాలు ఇచ్చుకోలేని దుస్థితి రావడం కొసమెరుపు. గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేదిస్తున్నది. అభివృద్ధి సంగతి అటుంచితే.. కనీసం కార్మికుల జీతాలు, ట్రాక్టర్ మెయింటెన్స్‌లాంటి పనులకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతున్నది. చాలా గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఓ పైపు వేయాలన్నా.. మోటరు కాలిపోతే రిపేరు చేయాలన్నా కష్టతరమవుతున్నది. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాది గడిచినా ఎన్నికల ఊసే లేకపోవడంతో వచ్చే రోజుల్లో గ్రామాలకు మరిన్ని కష్టాలే అన్నట్లు కనిపిస్తుంది.


**జిల్లాలో 255 జీపీలుంటే..**

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ జీపీల వారీగా 1079 మంది కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాలోని మెజార్టీ జీపీల్లో చాలా వరకు కార్మికులకు జీతాలు ఇవ్వాలన్నా కష్టంగా మారింది. కొద్దొగొప్పో ఉన్న చోట మాత్రమే కార్మికుల వేతనాలు ఇస్తూ అవస్థలతో నెట్టు కొస్తున్నారు. జిల్లాలోని ఒక్కొక్కచోట ఒకలా కార్మికుల జీతాల సమస్య పీడిస్తున్నది. రెండు నెలల నుంచి మొదలుకొని 8నెలల వరకు జీతాలు రాని పరిస్థితులు పలు గ్రామ పంచాయతీల్లో ఉన్నాయి. ఇలా ఒకచోట ట్రాక్టర్ మరమ్మతు సమస్య ఉంటే, మరోచోట కార్మికుల జీతాల సమస్య, ఇంకోచోట కార్మికులు పనులు మానేస్తున్న పరిస్థితులు గ్రామ పంచాయతీలను పీడిస్తున్నాయి.

**పండుగ పూట పస్తులేనా..?**

గ్రామ పంచాయతీ కార్మికులకు ఉగాది సందర్భంగానైనా జీతాలు అందుతాయని ఆశించారు. ఒకటి కాదు రెండు కాదు నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉంచడంతో కార్మికులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. అనేకచోట్ల కార్మికులు చందాలు అడుక్కుంటూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలుపుకున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలోని 15 మండలాల్లోని గ్రామాల్లో ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క పరిస్థితి ఉంది. ఇంకాను పెద్ద జీపీలు, మధ్యస్థ జీపీల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాల స్థితిగతులు ఒకలా.. చిన్న జీపీల కార్మికుల పరిస్థితులు మరొకలా ఉన్నాయి. చివరకు పండుగకైనా జీతాలందుతాయన్న కార్మికుల ఆశలు అడియాశలవుతున్నాయి.

## ట్రెజరీలో చెక్కులు వేసినా..



ప్రతినెలా కార్మికుల జీతాల కోసం గ్రామ కార్యదర్శులు చెక్కులు కొట్టి ట్రెజరీ కార్యాలయాలకు పంపిస్తున్నారు. ఇది ప్రతినెలా ఓతంతులా మారింది తప్పా ఎలాంటి ఉపయోగం లేదు. మూడు నెలలు దాటిందంటే వేసిన చెక్కు చెల్లడం లేదు. గడువు ముగుస్తున్న చెక్కుల విషయంలో కనీసం కార్మికుల జీతాల వరకైనా సర్కార్ సానుకూలంగా వ్యవహరించక పోవడంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఇలా చాలా నెలలుగా ట్రెజరీల్లో కార్మికుల వేతనాల చెక్కులను ఇవ్వడం కార్యదర్శులకు పరిపాటిగా మారింది. ఇదిలా ఉంటే.. జిల్లాలో 8 నెలలుగా జీతాలందుకోని గ్రామ పంచాయతీలున్నాయి. మరికొన్ని 6,4,2 నెలల వారీగా జీతాలు అందని గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం రెండు నెలలు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి కార్మికుల జీతాలను టీఎస్ బీపాస్ ద్వారా చెల్లించాలని ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఎస్బీఐలో జీపీ ఖాతాలున్న వాటికి ఇబ్బంది లేకున్నా.. ఇతర బ్యాంకుల్లో అకౌంట్లున్న జీపీలకు రెండు, మూడు రోజుల వరకు ఈ ప్రక్రియ పడుతుందని కార్యదర్శులు చెబుతున్నారు.

### ఎనిమిద్నెళ్లుగా జీతాల్లేవు



ఒకటి కాదు రెండు కాదు ఎనిమిది నెలల తరబడి జీతం ఇవ్వకుంటే మేం ఏం తినాలి. ఎలా పని చేయాలి. మాలాంటి చిన్న కుటుంబాలు నెలకు జీతం వస్తేనే నడిచేది కష్టం. ఇన్ని నెలలు పెండింగ్ పెడితే మేం ఎవరికి చెప్పాలి. మా కొచ్చే చిన్న జీతాలు ఇవ్వకపోవడం దారుణం. ఇక నెలల కొద్ది రాకుంటే మా కష్టాలు ఎవరికి చెప్పాలే. జీతాలడిగితే వచ్చినప్పుడు ఇస్తాం అంటూ కార్యదర్శి చెబుతున్నారు. సర్కారు మాకు చెల్లించాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి.

**- ఆంజనేయులు, కార్మికుడు, గట్లఖానాపూర్, పెద్దమందడి మండలం**

### రెండు నెలల జీతాలొచ్చాయి



ట్రెజరీల్లో వేసిన జీపీ కార్మికుల చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన కార్మికుల జీతాలను టీఎస్ బీపాస్ ద్వారా చెల్లించే విధంగా నిధులు విడుదల అయ్యాయి. ఎస్బీఐలో అకౌంట్లున్న జీపీలు వెంటనే తీసుకోవచ్చు. ఇతర బ్యాంకుల్లో అకౌంట్లున్న జీపీలు ఒకరోజు అటు.. ఇటుగా జీతాలు తీసుకుంటారు. ప్రభుత్వ స్థాయిలోనే ట్రెజరీ చెక్కులు పెండింగ్ ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు పెండింగ్ చెక్కులు కూడా క్లియర్ అవుతాయి.

**- సురేశ్, జిల్లా పంచాయతీ అధికారి, వనపర్తి**

గట్లఖానాపురం జీపీలో ఐదుగురు కార్మికులు పని చేస్తుండగా.. 8 నెలలుగాజీతాలు ఇవ్వలేదు. అవసరాలకు సరిపడా నిధులు లేక.. కొత్తవి రాక.. కార్మికులకు కష్టమైంది. ఉన్న కొద్దిమందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి. తప్పని పరిస్థితిలో ఇక్కడ ఇంకా పనిచేస్తున్నారు. అయితే.. కార్మికులకు సంబంధించిన జీతాల చెక్కులను ప్రతినెలా ట్రెజరీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి ఇచ్చినప్పటికీ అవి పాస్ కావడం లేదు.

## అలంపూర్ ఆలయాల్లో ఏం జరుగుతోంది?

- అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలి
- శాసనమండలి సభలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ చల్లా

గద్వాల అర్బన్, మార్చి 28 : జిల్లాలోని అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఆలయ అధికారులు, అర్చకులు గత కొంత కాలంగా అవినీతికి పాల్పడుతున్నట్లు పత్రికల్లో పెద్ద మొత్తంలో కథనాలు వెల్లువడుతున్నట్లు మండలి సభలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ప్రస్తావించిన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్ దేవస్థానంలో అవినీతి వ్యవహారం నడవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మండలి సభలో మంత్రి కొరారు. గత కొంత కాలంగా ఆలయంలో ఏం జరుగుతుందో.. అసలు తెలియడం లేదు.. దాతలు, భక్తులు ఇచ్చే విరాళాలు, కానుకలు, చెక్కులకు సంబంధించిన లెక్కలు, వివరాలు సరిగ్గా లేవని వివరించినట్లు సమాచారం. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి ఆలయంలోని అక్రమార్కులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం అప్రమత్తమై అవినీతి వ్యవహారంపై దేవదాయ శాఖ అధికారులతో సమాచారం తీసుకొని అక్రమ వ్యవహారాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న విజయుడు

## ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయండి

- మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే విజయుడు వినతి

అలంపూర్ చౌరస్తా, మార్చి 28 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రద్దు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే విజయుడు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రాజోళి మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యంతో వ్యవసాయం, పశుపక్షాదులతోపాటు మనుషులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అందుకే వెంటనే ఫ్యాక్టరీని రద్దు చేయాలని కోరారు. దీంతో మంత్రి స్పందించి మాట్లాడుతూ కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## కన్నీరే.. మిగిలింది



రామాపురంలో ఎండిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు

వడ్డేపల్లి, మార్చి 28 : ఆర్డీఎస్, నెట్టంపాడు కాల్వల పరిధిలో సాగు చేసిన పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటికీ తుంగభ్ర నదిలో నీటి ప్రవాహం ఉన్నంత వరకు నీళ్లు వస్తాయి. రిజర్వాయర్లు నిర్మించి నీటిని అందిస్తామన్నా కాంగ్రెస్ ప్రభుత్వ వాగ్దానం నీటి మూటగానే మారడంతో ఆయకట్టు పరిధిలో సాగు నీరందక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. మండలంలోని రామాపురానికి చెందిన మద్దిలేటి అనే రైతు తన బోరులో నీళ్లు సరిపోతాయని పంట వేసుకున్నాడు. ఆర్డీస్ కాల్వల్లో నీళ్లు లేనందున భూగర్భ జలాలు తగ్గినందున తన బోరులో నీళ్లు రాలేదు. పంట ఎండ కూడదని మూడు బోర్లు వేసినప్పటికీ చుక్కనీరు రాలేదు. పంటకు పెట్టిన పెట్టుబడి బోర్లు వేసేందుకు చేసిన రూ.లక్ష అప్పు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నాడు.

## ముగిసిన న్యాయవాదుల సంఘం ఎన్నికలు



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 28 : మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ముగిశాయి. ప్రధాన ఎన్నికల అధికారి కొండయ్య నేతృత్వంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 424 మంది ఓటర్లు ఉండగా అందులో 379 వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. 4గంటల అనంతరం కౌంటింగ్ నిర్వహించగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా నాగోజీ, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, కోశాధికారిగా వెంకట్రావు, లైబ్రేరియన్‌గా రాజుతోపాటు పది మంది సభ్యులు గెలుపొందారు. వీరికి సీనియర్ న్యాయవాదులు అభినందించారు.

## రుణమాఫీ చేయాలంటూ..

- మండుటెండలో రైతుల నిరసన
- కొల్లాపూర్-పెబ్బేర్ ప్రధాన రహదారిపై గంటన్నర పాటు రైతుల రాస్తారోకో
- పెంట్లవెల్లి సొసైటీలో రుణాలు తీసుకున్న 499 మందిలో ఒక్కరికీ మాఫీ కాలేదని ప్రభుత్వంపై ఆగ్రహం



పెంట్లవెల్లిలో రుణమాఫీ చేయాలంటూ రాస్తారోకో చేపట్టిన రైతులు

పెంట్లవెల్లి, మార్చి 28 : కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన రైతులందరికీ రెండు లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నేటి వరకు పెంట్లవెల్లి సొసైటీలో ఒక్క రూపాయి రుణమాఫీ కాక పోవడంతో పెంట్లవెల్లి సొసైటీ పరిధిలోని కొండూరు, మల్లేశ్వరం, మంచాలకట్ట, మాధవ స్వామినగర్, ఎంగంపల్లితండా, రామాపురం, సోమశిల గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అంతకు ముందు విండో చైర్మన్ విజయరామారావు అధ్యక్షతన సొసైటీ కార్యాలయంలో మహాజనసభ కార్యక్రమాని నిర్వహిస్తుండగా సభను ఆయా గ్రామాల రైతులు అడ్డుకొని సొసైటీ సమీపంలో పెబ్బేర్-కొల్లాపూర్ వేళ్లే ప్రధాన రహదారిపై మండుటెండను సైతం లెక్కచేయడకుండా సుమారు గంటన్నర పాటు రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పెంట్లవెల్లి సొసైటీలో రుణాలు తీసుకున్నామని, త్వరలో మాఫీ అవుతుంది కదా అని ఇతరుల వద్ద డబ్బులు వడ్డీకి తీసుకున్నాం.. సొసైటీలో రుణమాఫీ కాకపోవడంతో ఇతరుల వద్ద తీసుకున్న అప్పుకు అసలు, వడ్డీ కట్టలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేయాలన్న ఉద్దేశంతోనే సొసైటీలో 499 మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే మూడు విడుతల్లో ఒక్కరికంటే ఒక్కరికీ నయాపైసా కూడా రుణమాఫీ కాలేదని విమర్శించారు. అదేవిధంగా సొసైటీ చైర్మన్ విజయరామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వేంకటేశ్వర్లు, మండల నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఆగస్టు 15వ తేదీ వరకు రూ.రెండు లక్షల వరకు అర్హులైన రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేసి తీరుతామని ప్రగాల్బాలు పలికి రాష్ట్రంలో కొందరికి మాత్రమే రుణమాఫీ చేసి సంబురాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పెంట్లవెల్లి సొసైటీలో 499మంది రైతులు రూ.3.26 కోట్లు పంట రుణాలు తీసుకున్నారని, ఇందులో ఒకరికి కూడా నయాపైసా రుణమాఫీ కాలేదన్నారు. ఎన్నోమార్లు హైదరాబాదులోని సొసైటీ కమిషనర్‌ను వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఏడు నెలల నుంచి పలువురు అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నా.. నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక రాజకీయ కక్ష సాధింపు చర్యలే కారణమని ఆరోపించారు. ఇంత రాద్ధాంతం జరుగుతున్నా మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంట్లవెల్లి సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులను రైతులను సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 200మంది రైతులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- అయిజ, అమరవాయి పెట్రోల్ బంక్‌లోని సిబ్బందిపై మారణాయుధాలు, ఇనుపరాడ్లతో బెదిరింపులు
- లాకర్‌లోని రూ. లక్ష నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ చోరీ, గదిలో ఫర్నీచర్ ధ్వంసం
- రెండు ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు



అయిజ పెట్రోల్ బంక్ గదిలో చిందరవందరగా సామాన్లు, అమరవాయిలో పగిలిన అద్దాలు

అయిజ, మార్చి 28 : అయిజ పట్టణంలో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు జేపీ పెట్రోల్ మార్ట్ (పెట్రోల్ పంపు)లో హల్‌చల్ చేశారు. పట్టణంలోని రాయిచూర్, ఉత్తనూర్ చౌరస్తా, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పెట్రోల్ పంపులోకి గుర్తు తెలియని దుండగులు శుక్రవారం తెల్లవారు జామున 1:30 గంటల సమయంలో జేపీ పెట్రోల్ మార్ట్‌లోకి ప్రవేశించారు. అర్ధరాత్రి కావడంతో గదిలో నిద్రిస్తున్న సిబ్బంది తిమ్మప్ప, అశోక్, భీమేశ్‌ను మారణాయుధాలు, ఇనుపరాడ్లతో బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. వారిని నగదును భద్రపర్చిన లాకర్ల తాళాలను ఇవ్వాలని లేనిచో చంపుతామని బెదిరించడంతో తాళాలు ఇచ్చారు. దుండగులు రూ. లక్ష నగదుతోపాటు సీసీ కెమెరాల ద్వారా రికార్డు అయిన హార్డ్‌డిస్క్‌లను భద్రపర్చిన పెట్టెను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. దుండగులు అక్కడి నుంచి వెళ్లిన వెంటనే సిబ్బంది పెట్రోల్ పంపు యజమాని బుగ్గారెడ్డికి సమాచారం అందించారు. ఆయన 100కు డయల్ చేయగా, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. శాంతినగర్ సీఐ టాటాబాబు, ఎస్సై శ్రీనివాసరావులు తెల్లవారు జామున 2:30 గంటలకు చేరుకొని ఈ ఘటనపై ఆరా తీశారు. అనంతరం సీసీఎస్ ఎస్సై నాగేశ్వర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రంజిత్‌లు చోరీ జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక దుండగులా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దుండగుల పనేనా అని పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. యజమాని బుగ్గారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ టాటాబాబు వెల్లడించారు.

### అమరవాయి పెట్రోల్ బంక్‌లో రూ.1.40 లక్షలు చోరీ

మల్దకల్, మార్చి 28 : మండలంలోని అమరవాయి గ్రామ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దాడి చేయడంతోపాటు రూ. 1.40లక్షలు దోచుకెళ్లిన ఘటన చోటుచేసుకున్నది. పెట్రోల్ బంక్ యజమాని గంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గురువారం పెట్రోల్, డీజిల్ రాత్రి 10 గంటల వరకు వాహనదారులకు వేశామన్నారు. అనంతరం బంక్‌లోని గదిలో సిబ్బంది నిద్రించారన్నారు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గదిలో నిద్రిస్తున్న సిబ్బందిని లేపారన్నారు. లేవకపోతే గది అద్దాలను పగులగొట్టి సిబ్బందిని కత్తులతో బెదించడంతోపాటు తీవ్రంగా కొట్టారు. అనంతరం వారి వద్ద పెట్రోలుకు సంబంధించిన రూ.లక్ష 40 వేలు లాక్కొని సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌లను సైతం తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై నందికర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బంక్ యజమాని గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే..

- బీఆర్ఎస్ నేత హనుమంతు నాయుడు



పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేత హనుమంతునాయుడు

గద్వాల, మార్చి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కాల్వలు ఎండిపోయి నీరులేక నియోజకవర్గంలో పొలాలు ఎండిపోవడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయని గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గద్వాల మండలం కొత్తపల్లిలో ఎండిపోయిన వరిపంట పొలాలను బైక్‌పై వెళ్లి, పార్టీ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష కట్టిందన్నారు. పంటలు ఎండుతున్న ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. పంటలు ఎండి రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికార పార్టీ నాయకులకు వారిని పరామర్శించే తీరికలేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే పంటలు ఎండిపోతున్నాయని దీంతో రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో మండుటెండల్లో సాగునీటి కాల్వలు జలాలతో కళకళలాడాయని, నేడు రేవంత్ పాలనలో అదే కాల్వలు నీళ్లులేక వెలవెల బోతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాల్వలు ఎడారిగా మారాయని, నీరు లేక రైతులు సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతున్నాయని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రోజు కూడా పంటలు ఎండి పోయిన సందర్భాలు లేవన్నారు. ప్రభుత్వానికి పాలనపై అవగాహన లేక ప్రాజెక్టుల ద్వారా నీరు అందించలేకపోతుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి పంటను సాగు చేయడానికి ఆసాముల దగ్గర అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలకు పెట్టుబడులు పెట్టామని ప్రస్తుతం నీళ్లు లేక పంటమొత్తం ఎండిపోయిందని బోరున విలపించారు. కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు స్పందించి కాల్వలకు నీటిని వదిలి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు.

## పింఛన్ ఇప్పించండి మహాప్రభో..


- 94 ఏండ్ల వృద్ధురాలి వేడుకోలు



అయిజ రూరల్, మార్చి 28 : మండలంలోని కిష్టాపురానికి చెందిన 94 ఏండ్ల వృద్ధాప్య మహిళ తనకు పింఛన్ ఇప్పించండి మహా ప్రభు అంటూ వేడుకుంటున్నది. వివరాలలోకి వెళితే మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ(98) తనకు పింఛన్ రావడం లేదని బోరున విలపించింది. గతంలో తన భర్తకు పింఛన్ వచ్చేదని దాంతోనే ఇద్దరం కాలం గడిపే వాళ్లమని చెప్పారు. తన భర్త మరణించి మూడేండ్లు అయినా తనకు ఇంతవరకు పింఛన్ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నడవలేని స్థితిలో అధికారుల చుట్టూ తిరుగుతున్నా తనను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులైనా స్పందించి తనకు పింఛన్ వచ్చేలా చూడాలని వేడుకుంటున్నది.

## దుఃఖాన్ని దిగమింగి..

- 'పది' పరీక్ష రాసిన విద్యార్థి



పరీక్షకు హాజరైన హేమంత్

అమ్రాబాద్, మార్చి 28 : తండ్రి చనిపోయిన బాధను దిగమింగి పదో తరగతి విద్యార్థి పరీక్ష రాసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. వివరాలిలా.. మన్ననూర్ గ్రామానికి చెందిన హేమంత్‌నాయక్ తండ్రి లక్యానాయక్ గురువారం రాత్రి చనిపోయాడు. విద్యార్థి బంధువులు, ఉపాధ్యాయుల సూచన మేరకు శుక్రవారం జరిగిన పదో తరగతి బయోసైన్స్ పరీక్షకు హాజరయ్యాడు. దుఃఖాన్ని దిగమింగుకొని స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష రాసిన అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

## చెప్పకుండా నా బంగారం వేలం

- బ్యాంకు అధికారులపై ఆగ్రహం

గద్వాల అర్బన్, మార్చి 28 : నాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేను కుదవ పెట్టిన బంగారాన్ని బ్యాంకు అధికారులు బహిరంగ వేలం వేశారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన అశోక్ అనే వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం తన భార్య నగలను జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకులో కుదవ పెట్టి రూ.2 లక్షలు తీసుకున్నాడు. లోన్ తీసుకొని సంవత్సరం మూడు నెలలు గడిచింది. ఈ క్రమంలో బ్యాంకు అధికారులు సమయం దాటిపోతుంది.. మీ లోను రెన్యూవల్ చేసుకోవాలని తెలపడంతో బాధితుడు సమయం దాటిన మూడు నెలల అనంతరం తీసుకున్న నగదుకు వడ్డీ చెల్లించాడు. అనంతరం అసలు డబ్బులు కూడా చెల్లిస్తా.. అని బ్యాంకు అధికారులకు తెలపడంతో లేదు.. మీరు బ్యాంకు పెట్టిన నిబంధన మేరకు సమయం దాటిన మీరు బ్యాంకు నగదు చెల్లించకపోవడంతో మీ నగలను బహిరంగ వేలం వేశామని, బ్యాంకు నగదు నిమిత్తం మిగతా డబ్బులు తీసుకుపోవాలని సూచించాడు. నేను సమయం దాటిన అనంతరం నేను తీసుకున్న డబ్బులకు వడ్డీ చెల్లించాను. నాకు చెప్పకుండా.. కనీసం నాకు నోటీస్ ఇవ్వకుండా మీరు ఎలా నా నగలను వేలం వేస్తారని బ్యాంకు అధికారులను నిలదీశాడు. తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు.

## ర్యాగింగ్ కలకలం

- జూనియర్‌పై సీనియర్ల వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థి
- నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఘటన

నాగర్‌కర్నూల్, మార్చి 28 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపుతున్నది. జూనియర్ విద్యార్థిపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతూ వేధింపులకు గురిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సీనియర్లు హర్షవర్ధన్, హిమవర్ధన్, లోకేశ్ రూమ్‌కు పిలిపించి యూపీఐ పిన్ చెప్పాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అలాగే ర్యాగింగ్ చేశారని, అందులో భాగంగా గోడ కుర్చీ వేయించారని, లేని సిలిండర్‌ను ఉన్నట్లుగా మోస్తూ చూపించాలని ఒత్తిడి తెచ్చారని సమాచారం. ఈ యాక్షన్ మధ్యలో ఆపేస్తే బెల్ట్‌తో సదరు విద్యార్థిపై ముగ్గురు సీనియర్లు దాడి చేసినట్లు తెలిసింది. ఘటన ఈనెల 24వ తేదీన చోటుచేసుకోగా విషయం తెలిసిన ప్రిన్సిపల్ రమాదేవి కళాశాల ఉన్నతాధికారులతోపాటు, అదనపు ఎస్పీ రామేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కళాశాలకు చేరుకున్న ఎస్సై గోవర్ధన్ బాధితుడి నుంచి వివరాలు సేకరించి ర్యాగింగ్ పేరుతో టార్చర్ పెట్టిన ముగ్గురిపై 26వ తేదీన కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. కాగా కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి ర్యాగింగ్ కలకలం రేపిన సంఘటన మొదటిసారని కళాశాల విద్యార్థులు పేర్కొంటున్నారు. ర్యాగింగ్ సంఘటన నిజమని తేలితే సదరు సీనియర్లను హాస్టల్ నుంచి మూడు నెలలపాటు సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు సీనియర్ల తల్లిదండ్రులకూ సమాచారం ఇచ్చినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. తల్లిదండ్రులతో చర్చించాక చర్యలు తీసుకోనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి పేర్కొన్నారు.